## ఈవీఎం, వీవీప్యాట్‌ల మొదటి స్థాయి పరిశీలన




సాంకేతిక నిపుణులతో మాట్లాడుతున్న ఎన్నికల కమిషన్ అదనపు కార్యదర్శి మల్లారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 9 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల మొదటి స్థాయి పరిశీలనను ఎన్నికల కమిషన్ అదనపు కార్యదర్శి , ఎఫ్ ఎల్ సి పరిశీలకుడు ఎ.మల్లారెడ్డి, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. శుక్రవారం పట్టణంలోని ఈవీఎం గిడ్డంగిలో భద్రపరిచిన, ఈవీఎం, వీవీ ప్యాట్ మొదటి విడుత పరిశీలన ప్రక్రియలో చేపడుతున్న వివరాలను సాంకేతిక నిపుణులను అదనపు కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ ఎల్‌సీలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీవో విజయకుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 9 : 2022-23 వానకాలం, యాసంగి సీజన్‌లలో సీఎంఆర్ మిగులు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి వెంటనే డెలివరీ చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సీఎంఆర్ రైస్ డెలివరీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన వానకాలం, యాసంగి మిగులు సీఎంఆర్ బియ్యాన్ని ఈనెల 29 వరకు ఎఫ్‌సీఐ కి డెలివరీ చేయాలని ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిల్లర్లు ఎవరైనా రీసైక్లింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు తమ పరిధి లోని మిల్లర్లను సంప్రదించి వారి సామర్థ్యం మేరకు సీఎంఆర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల్లో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కొండల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలేశ్వర గుప్తా, శ్రీధర్‌రెడ్డి, మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

## నూనె గింజల సాగుపై దృష్టి సారించాలి

**భారతీయ నూనెగింజల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్‌కుమార్**



తిర్మలాపూర్‌లో నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

షాబాద్, ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో నూనెగింజల సాగుపై రైతులు దృష్టి సారించాలని భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుసుమ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె గింజల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. షెడ్యూల్ కులాల ఉప పథకం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. కుసుమ పంటలో సస్యరక్షణ చర్యలకు పంటకు డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీపై డాక్టర్ సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ విత్తనాలకు, భారతీయ నూనెగింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్, హైదరాబాద్ వారు అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడి విషయంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. నూనె గింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా గత సంవత్సరం అక్టోబర్‌లో షాబాద్ మండలంలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, బొబ్బిలిగామ తదితర గ్రామాల్లో సుమారు 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే కుసుమ విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంగేష్‌దుటే, డాక్టర్ కురేషి, డాక్టర్ సురేశ్, డాక్టర్ జవహర్, సుగుణ మాల రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, యాదవరెడ్డి, రాజు, శేఖర్, రాంచంద్రయ్య, కిరణ్‌రాథోడ్, అశోక్, ఆయా గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా హామ్స్‌టెక్ ఫ్యాషన్ షో



మాదాపూర్, ఫిబ్రవరి 9: హామ్స్‌టెక్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేసి సందర్శకులను విశేషంగా అలరించారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హామ్స్‌టెక్ ఫ్యాషన్ షో-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సెలెబ్రిటీ, నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా విచ్చేసి డిజైనర్‌లు కామిని షరీఫ్, గౌరాన్షా, హామ్స్‌టెక్ సీఈవో అజితారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యతతో మూడేండ్లుగా నేర్చుకున్న ఫ్యాషన్ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. సస్టెనబిలిటీ డిజైన్ అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200 మందికి పైగా డిజైనర్లు వేయికి పైగా డిజైన్‌లను స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఇందులో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన దుస్తులతో పాటు లైటింగ్ ల్యాంప్, గృహోపకరణ ఉత్పత్తులను ప్రదర్శించడంతో విద్యార్థులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో చిందులు వేస్తూ సందడి చేస్తూ ఉత్సాహంగా గడిపారు.






## 20న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

**మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం**

**కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ) : పకడ్బందీగా నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కర పత్రాలు, గోడ ప్రతులను కలెక్టర్ శశాంక ఆవిష్కరించి మాట్లాడారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఈ నెల 20న తప్పని సరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని అన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 20వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికలకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఏవైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేకపోయిన వారికి ఫిబ్రవరి 27వ తేదీన అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8 లక్షల 9 వేల 357 మంది పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడానికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1774 మంది ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో డీఈవో, పీడీ మెప్మా, పీడీ డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమ అధికారి, డీపీవో, జడ్పీ సీఈవోల సమన్వయంతో సమావేశాలు నిర్వహించి 9 నెలల వయస్సు గల పిల్లల నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు విటమిన్ -ఏ మాత్రలను వేయించాలని సూచించారు. పల్స్ పోలియోపై కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారన్నాన్నారు. జిల్లాలో మురికి వాడలు, ఇటుక బట్టీల వద్ద నివసించే పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. రంగారెడ్డి జిల్లాను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జడ్పీ సీఈవో దిలీప్ కుమార్, డీఆర్డీవో పీడీ ప్రభాకర్, ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి పద్మజారమణ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా ఇమ్యునైజషన్ అధికారిణి డాక్టర్ స్వర్ణ కుమారి, సంబంధిత జిల్లా అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

### 108 సేవలు భేష్

**- వసంత పాపయ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్**



యాచారంలో 108 అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

యాచారం, ఫిబ్రవరి9: 108 సేవలు ఎంతో భేషుగ్గా ఉన్నాయని 108 ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వసంత పాపయ్య అన్నారు. మండల కేంద్రంలోని 108 వాహనాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన, సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్ సేవలకు సంబంధించిన పరికరాలు, రోజువారీ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వసంత పాపయ్య మాట్లాడుతూ అత్యవసర సమయంలో108 అంబులెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆయన సూచించారు. అంబులెన్స్‌లో ప్రజలు, రోగులకు అవసరమైన పరికరాలు, ఇంజెక్షన్లు, మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఎంఈ రమేశ్, వెంకటేశ్, ఈఎంటీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

### సకాలంలో పశువులకు టీకాలు వేయించాలి

షాద్‌నగర్‌రూరల్, ఫ్రిబవరి 9 : పాడి రైతులు సకాలంలో పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి అంజీలప్ప సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో తైలేరియా వ్యాధిపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక విలువగల సంకర జాతి ఆవులకు తైలరియా వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు ఎలాంటి రుగ్మతలు వ్యాపించినా వెంటనే పశువైద్య శిబిరానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ విజయ్‌కుమార్, కె.విజయ్‌కుమార్, పశువైద్యాధికారి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి అంజిలప్ప



అటవీ ప్రాంతంలో ఎగిసిపడుతున్న మంటలు

## కార్చిచ్చును ఆర్పేద్దాం..

### వేసవిలో అడవుల సంరక్షణపై ప్రత్యేక ప్రణాళిక

**అగ్ని ప్రమాదాల నివారణకు బృందాల ఏర్పాటు**

**అటవీ సంపదను కాపాడుకునేందుకు కృషి : ఎఫ్ఆర్‌వో విష్ణువర్ధన్**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9 : అడవిలో కార్చిచ్చు వ్యాపించేందుకు అనేక కారణాలను చెప్పుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉన్న అటవీ సంపదను కాపాడుకునేందుకు ఏటా వేసవికి ముందుగానే అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ప్రతి వేసవిలోనూ అడవికి కార్చిచ్చు ప్రమాదం జరుగడానికి ప్రథమ కారణం మనుషులే.. అటవీ ప్రాంతాన్ని సందర్శించిన సమయంలో బీడీలు, సిగరెట్లు తాగి కింద పడేస్తుంటారు. అది రాజుకుని చిన్న మంటగా మొదలై కార్చిచ్చుగా వ్యాపిస్తున్నది. కొంతమంది అడవిలో సంచరిస్తూ వంటలు చేసుకుని నిప్పును పూర్తిగా ఆర్పి వేయకుండానే వెళ్లిపోతుంటారు. వేసవి కాలం కావడంతో మంటలు సులువుగా వ్యాపిస్తుంటాయి. వేసవిలో చెట్ల ఆకులు ఎండి రాలిపడుతుంటాయి. ఎండిన ఆకులు ఉండటం, గుట్టలపై నుంచి రాళ్లు జారి పడుతూ.. రాసుకోవడం వల్ల కూడా నిప్పు రవ్వలు ఎగిసి పడడంతో మంటలు వ్యాపిస్తుంటాయి. అటవీ ప్రాంత సమీపంలో పొలాలు ఉన్న రైతులు చెత్తను తగలబెట్టిన సమయంలో నిప్పు రవ్వలు అడవిలో పడి అగ్గి రాజుకుంటున్నది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఫారెస్టు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అగ్ని ప్రమాదాలు ఎక్కడ జరిగినా శాటిలైట్ ద్వారా తెలుసుకుని అటవీ శాఖ బృందాలను అలర్ట్ చేస్తున్నారు.

**అటవీ సందపను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు..**

జిల్లాలో రెండు అటవీ ప్రాంతం డివిజన్లు ఉన్నాయి. అందులో శంషాబాద్, ఆమనగల్లు డివిజన్లు ఉండగా, వీటిలో ఆమనగల్లు డివిజన్ పరిధిలో ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్లు రేంజ్‌లు ఉండగా, శంషాబాద్ డివిజన్ పరిధిలో మంఖాల్, చిలుకూరు, హయత్‌నగర్ రేంజ్‌లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అటవీ ప్రాంతం విస్తరించి ఉన్నది. ఈ ప్రాంతంలో అరుదైన చెట్లతో పాటు జంతువులు, పక్షులు సంచరిస్తుంటాయి. కార్చిచ్చు వ్యాపిస్తే అడవిలోని చెట్లు కాలిపోయే ప్రమాదం ఉన్నది. అగ్ని ప్రమాదాల వల్ల మూగజీవాలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. మూగజీవాలు, పచ్చని చెట్లను రక్షించేందుకు అటవీ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిప్పులు రాజేయవద్దని, సిగరెట్లు, బీడీలు కాల్చి పడవేయవద్దని చెబుతున్నారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా బేస్ క్యాంప్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ వణ్యప్రాణుల సంరక్షణతో పాటు అటవీ సంరక్షణ కోసం పని చేస్తాయి. ఈ బృందాలు రాత్రి, పగలు సమయంలో అటవీ ప్రాంతాల్లోనే గస్తీ తిరుగుతూ అడవిని కాపాడుతాయి. ట్రాక్టర్లతో పిక్స్‌లో నీటిని నింపుతూ మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నారు.



గున్‌గల్ అడవిలో మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

**మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్‌లైన్స్..**

వేసవిలో పెద్ద ఎత్తున మంటలతో అటవీ ప్రాంతం ప్రమాదానికి గురయ్యే అవకాశమున్నది. అటవీశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది అటవీ ప్రాంతాల్లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. 5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫైర్‌లైన్స్ బాక్సులు మంటలను అదుపు చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఒక బాక్సులో నుంచి మరో బాక్సులోకి మంటలు ప్రవేశించకుండా ఫైర్‌లైన్స్ ఎంతో మేలు చేస్తాయి.



గున్‌గల్ అటవీ ప్రాంతంలో..



**అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు..**

అడవిని రక్షించుకునేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో కార్చిచ్చు వ్యాపించకుండా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అదుపులోకి తీసుకొస్తున్నాం. మంటలను అదుపు చేసేందుకు అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశాం. అడవి ప్రాంతాల్లో ఎక్కడ మంటలు అధికంగా వ్యాపిస్తాయో గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. అటవీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు సిగరెట్లు, బీడీలు తాగి పడవేయవద్దు.

**- విష్ణువర్ధన్, అటవీ శాఖ ఇబ్రహీంపట్నం రేంజ్ అధికారి**

### పార్లమెంటు ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**-కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంటు ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కె.శశాంక కోరారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఎస్ఆర్ - 2024 తుది ఓటరు జాబితాపై జిల్లా కలెక్టర్ శశాంక గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ - 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 35,91,987 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్ కార్యాలయాల్లో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఓటరు జాబితా లిస్ట్‌ను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించుకోవచ్చని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా లిస్ట్‌ను అందజేస్తామని, గుర్తింపు లేని రాజకీయ పార్టీల వారు ఓటరు జాబితా లిస్ట్ కోసం ఖర్చు భరించాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ చెక్ యువర్ ఓట్ క్యాంపెయిన్ ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### తాగిన మైకంలో తల్లిని చంపిన కొడుకు

**కొంగరకలాన్‌లో గ్రామంలో చోటు చేసుకున్న ఘటన**

ఆదిబట్ల, ఫిబ్రవరి 9 : తాగుడుకు బానిసై తాగిన మైకంలో ఓ కొడుకు కన్న తల్లినే హత్య చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్ లో శుక్రవారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడ లలిత(51) కొడుకు కొయ్యడ పెంటయ్యతో కలిసి నివాసం ఉంటున్నది. గ్రామంలో ఇద్దరు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. పెంటయ్య గత కొన్ని రోజులుగా మద్యం సేవించి లలితను వేధిస్తుండేవాడు. అదేమాదిరిగా శుక్రవారం తెల్లవారు జామునా తాగిన మైకంలో తల్లిపై దాడి చేసి హత్య చేశాడు. దీంతో మృతురాలి బంధువులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి లలితను హత్య చేసింది పెంటయ్యనే అని తేల్చి చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.